జిందగీ
చిరాత్రేచ

నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 20 జనవరి 2025
www.ntnews.com

ఎవరికి వారే యమునా తీరే

కథాసుధ

ఒక గ్రామంలో రెండు వీధులు ఉండేవి. మధ్యలో ఓ చిన్న నీటి కొలను ఉండేది. దాని ముందు శ్రీకృష్ణుడి విగ్రహం ఒకటుంది. ఆ రెండు వీధుల మధ్య సఖ్యత లేకపోవడంతో.. ఎప్పుడో కానీ, ఆ విగ్రహానికి పూజలు చేసేవారు కాదు. ఈ విషయం ఆనోటా ఈనోటా వ్యాపించి పొరుగూరిలోని ఓ కృష్ణ భక్తుడికి చేరింది. 'ఒక పౌర్ణమి రోజు సాయంత్రం నేను మీ ఊరు వస్తాను. ఆ రోజు శ్రీ కృష్ణుడి విగ్రహానికి పూజ చేద్దాం. పాటలు పాడుదాం. పూజకు కావాల్సిన వస్తువులతో పాటు పూలహారం కూడా తీసుకురండి. పాటలు పాడే వారిని నేను తీసుకువస్తాను' అని గ్రామస్తులకు కబురు పంపాడు ఆ భక్తుడు.

పౌర్ణమి రోజు రానే వచ్చింది. ఒక సత్కార్యం చేయబోతున్నందుకు ఆ భక్తుడు ఎంతో సంతోషపడ్డాడు. 'ఎప్పుడెప్పుడు సాయంత్రం కాబోతుందా' అని ఆశగా ఎదురు చూసి పాటలు పాడే బృందంతో కలిసి ఆ గ్రామానికి చేరాడు. అయితే అక్కడ పరిస్థితి వేరుగా కనిపించింది. సఖ్యత లేని ఆ గ్రామస్తులు విగ్రహానికి పూలహారం తీసుకు రాలేదు. 'అది తూర్పు వీధి వారి పని, అది పడమటి వీధి వారి పని' అని రెండు వీధుల వారూ పంతాలకు పోయి హారం తీసుకు రాలేదని ఆ భక్తుడికి అర్థమయ్యింది. 'సరే, జరిగిందేదో జరిగింది. మీ ఇళ్లల్లో పూల మొక్కలు ఉన్నాయా?' అని గ్రామస్తులను అడిగాడు. 'ఎందుకు లేవు? అందరి ఇళ్లల్లోనూ ముద్దబంతి మొక్కలు ఉన్నాయి' అని ఒకేసారి బదులిచ్చారు. ఆ భక్తుడు తన బృందంతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లాడు. ఒక్కో ఇంటి నుంచి ఒక్కో ముద్దబంతి పుష్పాన్ని కోయించుకొని వచ్చాడు. గ్రామానికి చెందిన మహిళల సాయంతో పెద్ద పూలహారాన్ని అల్లించాడు. విగ్రహానికి పూలమాల వేస్తూ 'విడిగా ఉన్నప్పుడు ప్రతి పువ్వూ దేనికదే ప్రత్యేకం. అన్నిటినీ దారంతో కలిపితే అది హారంగా మారింది. దేవుడి మెడలో అలంకారమైంది. మీరు పంతాలు, పట్టింపులకు పోయి 'ఎవరికి వారే యమునా తీరే' అన్నట్లుగా ఉండకండి. కలిసి పనిచేస్తే అందరూ బాగుపడతారు. కలహాలు కొనసాగిస్తే అందరూ ఇబ్బందిపడతారు. పూలహారంలో పూలు ఒదిగిపోయినట్లు మీరంతా కలిసి జీవించండి' అని హితవు చెప్పాడు. వాస్తవం గ్రహించిన గ్రామస్తులు ఆ సాయంత్రం అంతా శ్రీ కృష్ణుడి విగ్రహం ముందు ఆటపాటలతో ఆనందంగా గడిపారు.

... ఆర్సీ కృష్ణస్వామి రాజు, 93936 62821

దరిద్ర నారాయణ సేవ

ఉపనిషత్ సారం

'దానం నామ న్యాయార్జిత ధన ధాన్యాదేః శ్రద్ధయా అర్థిభ్యః ప్రదానమ్' అని చెబుతుంది 'శాండిల్యోపనిషత్తు'. దానమంటే న్యాయంగా సంపాదించిన ధనధాన్యాదులను శ్రద్ధతో అర్థిజనులకు ఒసగడం... అని భావం. దానం ఎటువంటిది ఇవ్వాలంటే న్యాయంగా సంపాదించిందని, ఎలా ఇవ్వాలంటే కసురుకోకుండా శ్రద్ధతో ప్రేమతో ఇవ్వాలని పై శ్లోక తాత్పర్యం. ఈ ఉపనిషత్ వాక్యానికి అద్దం పట్టే ఒక మహాత్ముని దయార్ద్ర హృదయాన్ని పరిశీలిద్దాం.



పరమ పవిత్రమైన పుణ్యక్షేత్రం 'కాశీ'లో చాలా సంవత్సరాల కిందట ఒక నేతపనివాడు ఉండేవాడు. అతను ఏరోజు నేసిన దుస్తులను ఆ రోజే అమ్మి, ఆ డబ్బుతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. దుస్తులు అమ్ముడుపోని రోజు ఆ కుటుంబం పస్తుండేది. ఒకరోజు మామూలుగా దుస్తులు తీసుకొని బజారుకు బయల్దేరాడు ఆ నేతగాడు. 'ఏమండీ! ఇవాళ్లయినా డబ్బులు తెస్తారా! పిల్లలు నిన్నటినుంచీ ఆకలితో అలమటిస్తున్నారు' అన్నది ఆ ఇంటి ఇల్లాలు. ఆయన 'అలాగే!' అని బయల్దేరాడు. వీధులన్నీ తిరిగినా వస్త్రాలను ఎవరూ కొన్న పాపాన పోలేదు. అయినా విసుక్కోకుండా వీధుల్లో తిరుగుతూనే ఉన్నాడు. ఇంతలో ఒంటిపై సరిగ్గా దుస్తులు కూడా లేని ఒక బీద బ్రాహ్మణుడు అతనికి తారసిల్లాడు. నేతపనివాడి చేతిలోని వస్త్రాన్ని చూసి, దానిని తనకు 'దానం ఇవ్వ'మన్నాడు. ఆ బీదవాణ్ని చూసి నేతగాడు జాలిపడ్డాడు. తన ఇంటి పరిస్థితి మరచిపోయి వస్త్రాన్ని అతనికి దానం చేస్తాడు. పేద బ్రాహ్మణుడు ఆ నేతగాణ్ని మనసారా దీవించి వెళ్లిపోయాడు. నేతగాడు ఖాళీ చేతులతో ఇంటికి బయల్దేరబోయాడు. అంతలో అతనికి తన కుటుంబ పరిస్థితి గుర్తుకువచ్చింది. ఇంట్లోవారికి ముఖం చూపించలేక వీధుల్లో తిరుగుతూ ఉండిపోయాడు. తోటి వారి దైన్యాన్ని గుర్తించి, తన పరిస్థితిని కూడా మర్చిపోయిన మహాదాత మరెవరో కాదు మహాత్ముడైన 'కబీరుదాసు'. దరిద్ర నారాయణ సేవ అంటే ఇదే! హిందీలో ఆయన రచించిన దోహాలు లోకప్రసిద్ధి చెందాయి. 'సోదరా! ఇద్దరు జగదీశ్వరులు ఎక్కడినుంచి వచ్చారు? ఒక ఈశ్వరుడే 'రాముడు, రహీము' మొదలైన పేర్లు ధరించాడు' అని ఏకతాభావాన్ని ప్రకటించాడు. మతసహనాన్ని చాటి చెప్పాడు.

... డా|| వెలుదండ సత్యనారాయణ

మహోత్కృష్టమైన మానవ జన్మ సార్థకం కావాలంటే కొన్ని విధులు పాటించాలి. పెద్దలు చూపిన బాటలో నడుస్తూ, ధర్మ పరిరక్షణకు పాటుపడాలి. కుటుంబ బాధ్యతలు, సామాజిక బాధ్యతలు నిర్వర్తిస్తూనే ఐదు రుణాలు తీర్చుకోవాలని శాస్త్రం చెబుతున్నది అవేంటంటే..

తీర్చుకుందాం పంచ రుణాలు

సనాతనం

దేవ రుణం: ఇంద్ర, వరుణ, వాయు దేవతల సాయంతో సూర్యుడు భూమిపై వర్షాన్ని కురిపించటం వల్లే పంటలు సమృద్ధిగా పండి, పంటలు రైతు చేతికి అందుతాయి. తద్వారా మనిషి జీవన పోషణ జరుగుతుంది. అందుకే సూర్యుడికి అర్ఘ్యమివ్వడం ద్వారా దేవతల రుణం తీరుతుందని శాస్త్ర వచనం.

పితృరుణం: పితృ తర్పణాలు, పిండోదక దానాలు, శ్రాద్ధకర్మలు మొదలైనవి ఆచరించడం ద్వారా, మరణించిన పితృ దేవతల రుణం కొంతైనా తీరుతుంది. అన్నిటినీ మించి పితృదేవతల పేరిట బీదసాదలకు చేసే దానం విశేష ఫలాన్ని ఇస్తుంది.

భూత రుణం: నీరు, భూమి, గాలి, ఆకాశం, అగ్ని వంటి పంచభూతాలు కరుణించడం వల్లనే పంటలు పండుతున్నాయి. అందుకే కృతజ్ఞతతో పంచభూతాలను కూడా పూజిస్తాం. పండిన పొలాల్లో పొంగలి మెతుకులు, పసుపు కుంకుమలు చల్లి ఎర్ర గుమ్మడి కాయను పగులకొట్టి దిష్టి తీసే ఆచారం కూడా కొన్ని చోట్ల ఉంది. పశుపక్ష్యాదులు, జంతువులకు గ్రాసం, ఆహారం అందివ్వడం కూడా భూత రుణంలో భాగమే!



మనుష్య రుణం: ఇతరుల సహాయ సహకారాలు లేనిదే సమాజంలో జీవనం సాగించలేం. అందుకు కృతజ్ఞతగా పరులకు సాయం చేసి వారి రుణం తీర్చుకోవాలి. నిరుపేదలకు, గురువులకు, సాటి మనుషులకు యథాశక్తి అన్నదానం, వస్త్రదానం, వారి అవసరాలను గుర్తించి సాయం చేయడం వల్ల మనుష్య రుణం తీర్చుకోవచ్చు.

రుషి రుణం: సత్ గ్రంథ పఠనం, ఆధ్యాత్మిక సాధన, సనాతన ధర్మ పరిరక్షణ, వేదవిద్యకు సహకారం అందించడం ద్వారా రుషి రుణం తీరుతుంది.

... శ్రీ భారతి

రాసలీలా వైభవం-9

అపశ్రుతి లేని ఉపసంహృతి

రాసక్రీడ అద్వైత క్రీడ. ఆత్మ క్రీడ. ఇక్కడ ఇద్దరు లేరు. రసస్వరూపి అయిన భగవంతుడే ఆస్వాద్యుడు, ఆస్వాదకుడు కూడా. భోగ్యమూ తానే, భోక్తా తానే. కాన, ద్వైత బుద్ధి- భావంతో ఈ లీలా రసానుభూతిని పొంద చూడడం అసంగతం. కాక, ఏకరూపులమయ్యే ఈ లీలను ఆకళింపు చేసుకోగలం. 'రసానాం సమూహః రాసః' - బహు విధాల రసా- ఆనందాల పుంజీ- రాశీ భూతమైన ఆనందమే కుంజ విహారి మురారి ఆడిన రాసక్రీడ. ఇందులో ఆనందం బిందువులు- ఖండితంగా, విడివిడి తునకలుగా కాక, కలివిడిగా తలమునకలుగా బలపడి అనంత రస సింధువుగా విలసిల్లుతుంది. ఈ ఆనందంలో భద్రము, క్షుద్రమూ- హెచ్చు, లొచ్చు (తక్కువ) అన్న భేదం ఉండదు. అది ఏకరసం- హాని వృద్ధి రహితం.

గోపీత్వం అంటే స్త్రీత్వం కాదు. అది దివ్య ఉన్మాదం. మహా ప్రేమ భావం. స్త్రీ పురుషులందరూ గోపీత్వం– గోపీ భావం పొందవచ్చు. 'స్త్రీ ప్రాయం ఇతరం సర్వం జగన్నాథైక పూరుషం'– గోపాలు డొక్కడే పురుషుడు. సమస్త జీవులూ స్త్రీలే– గోపికలే. జీవుడు ప్రేయసి, జగన్నాథుడు ప్రియుడు. ఈ రస రాజమే 'మధుర' రసం. ఈ మధుర రస సాగరమే రాసం'. రాధా గోవిందుని కొరకు రోదించే వారే గోపికలు. భుజాలపై సంసారం, బుద్ధిలో భుజగశయనుడు! బైట సంసారం, లోన కంసారి! వారే గోపికలు. రాధాదేవి రాసేశ్వరి, యోగ మాయా స్వరూపిణి. 'రసో వై సః'– బ్రహ్మ రస స్వరూపుడైనా 'యోగ మాయ' లేనిదే రాసం లేదు. రాధాబాల 'లీలా వినోదిని'. రస స్వరూపుడైన వసుదేవ సూనుడు సౌందర్య, మాధుర్య లావణ్య నిధి. వాసుదేవుడు చిదంశ,

బృందావనం సదంశ, గోపికలు రసాంశలు– ఆనందాంశలు. వ్రజభూమి రస్య– రస– రసికుల త్రిపుటి. రాసం ఈ త్రిపుటీ భంగలీల. శ్రీకృష్ణ పరమాత్ముని త్రిభంగీ తత్త్వమే మహత్త్వ మయమైన రాసలీల!

రాసలీలలో, వ్యాస పుత్రుడు శుకుడు ఏ గోపిక పేరూ పేర్కొనక కాశ్చిత్, అన్యా, అపరా, ఏకా ఇత్యాది సర్వనామాలనే సంధించాడు. అమాత్యుడు కూడా 'ఒక్క, ఒకతె' అని బాదరాయణినే అనుసరించాడు. సర్వేశ్వరుడు వేణుగానం చేసి సర్వజీవులను రాసక్రీడకు ఆహ్వానిస్తాడని, అందరూ అధికారులే అని శ్రీధరుని వ్యాఖ్యానం. ఇక, రాసలీలలోనే కాదు, భాగవతంలో ఎక్కడా రాధానామ ఉచ్చారణ కూడా కనిపించదు. అయితే, 'శ్రీభగవానువాచ, శ్రీ శుక ఉవాచ' అని అన్నప్పుడు 'శ్రీ'కారం రాధకు సంకేతం. భగవంతుడు మాధవుడు రాధా వల్లభుడు. వైయాసకి– శుకుడు రాధకు శిష్యుడు. గత జన్మలో ఈ బాదరాయణి– శుకుడు రాధ పెంపుడు శుకము– చిలుక. ఆ శుకమే ఇప్పటి ఈ శుకుడు. తన శ్రేయస్సు– మేలు కోరువాడు, ప్రేయస్సయిన– ప్రియమైన తన గురువు నామాన్ని ప్రత్యక్షంగా పలకడాన్ని శాస్త్రం నిషేధించింది. మరీ విశేషంగా, రాధా నామం ఉచ్చరించిన మాత్రాన సచ్చరిత్రుడైన శుకదేవునికి ఆరు మాసాలపాటు మూర్ఛ– సమాధి వస్తుందట! అందుకని పరీక్షిత్తు మేలుకోరి శుకముని పరమ పావని రాధారమణి నామధేయాన్ని పలుకకుండా నిండా జాగ్రత్త వహించాడట!

శుకుడు పరీక్షిత్తుతో.. రాజా! ఆ పల్లవాధరలు– గోపికలు నల్లమబ్బుల నడుమ తటిల్లతల– మెరుపు తీగల్లాగ ప్రకాశిస్తూ నల్లనయ్యతో ఉల్లాసంగా ఆడారు, పాడారు.

క॥ 'అంకరహితేందు వదనలు
పంకజలోచనుని గూడ పరగ నటింపం
గింకిణుల నూపురంబుల
కంకణముల మ్రోత లెసగె గర్ణోత్సవమై'..

మచ్చలేని తొగ నెచ్చెలి– చందురుని వంటి మోములు గల మచ్చెకంటులు– మీనాక్షులు, కంజాక్షుడు కృష్ణునితో కూడి చక్కగా నాట్యం చేసే వేళ, వారి నడుముల కింకిణులు, చిరుగంటలు, కాలి అందెలు, కర కంకణాలు గల్లు– గల్లున మ్రోగుచూ వీనులకు విందుగా వినిపించాయి.

క॥ 'హరిణీ నయనల తోడను
హరి రాసక్రీడ సేయ నంబర వీథిన్
సురనాథులు భార్యలతో
సొరిది విమానంబు లెక్కి చూచిరిలేశా!

రాజా! లేడికన్నుల వంటి కన్నులు గల ఆ కిన్నెర కంఠులు– గోపికలతో రాజీవాక్షుడు చేసిన రాసక్రీడను వినువీథిలో విబుధ (దేవ) వల్లభులు వారి దేవేరు– భార్యలతో బారులు తీరి విమానాలెక్కి వీక్షించారు.

క॥ 'రామల తోడను రాసము
రామానుజుడాడ జూచి రాగిల్లి మనో
రాముల మీద వియచ్చర
రాములు మూర్ఛిల్లి పడిరి రాజకులేంద్రా!

'రాజా! రామానుజుడు– వాసుదేవుడు గోపభామలతో రాసలీల ఆడుతుండగా చూచి కామ పీడితలై దేవతా రాములు– సతులు పారవశ్యంతో తూలి తమ ప్రియతమ పతులపై వాలిపోయారు.' మాకంద (మామిడి) ఫలం లాంటి హృద్యమైన పై కంద పద్యంలో అమాత్యుడు పోతన, ప్రాస స్థానంలో 'రామ రామ' అని పునరుక్తిగా పలుకుతూ, వాసుదేవుని రాసలీల సకల జన మనోల్లాసకరమైన రామరాజ్యం వలె భాసిల్లిందని సమంజసంగా వ్యంజింపజేశాడు.

శుకుడు– రాజా! ఇలా గోపికలు షోడశ– పదహారు విధాల శృంగారాలచే శోభితలై, అనేక భంగిమలతో, దేవగణాలు రసావేశంతో పరవశిస్తుండగా దేవదేవునితో కలసి నృత్యం చేశారు. ఆ రాససభలో రేణువాసాలే– తుమ్మెదలే గాయకులు. ఈ విధంగా షడ్గుణైశ్వర్య సంపన్నుడు శ్రీకృష్ణుడు– సర్వజీవుల ఆత్మలయందు క్రీడించు పరమాత్మ, ఎందరు గోపికలో అందరు గోవిందులుగా తానే ఏర్పడి, 'యథార్భకః స్వప్రతిబింబ విభ్రమః'– 'నిజ ప్రతిబింబంబుల తోడం గ్రీడించు బాలు పోలిక'... అమాయకుడైన పసిబాలుడు నిర్వికార భావంతో, అద్దంలోనో, నీటిలోనో తన ప్రతిబింబాల విలాసాలను చూచి వానితో ఉల్లాసంగా ఆడుకొనే విధంగా, నందగోపాలుడు గోపికలతో రాసక్రీడ సాగించాడు. అనగా, ఆ వాలుగంటుల– గోపికల కలయిక తనను అంటలేదని పరమార్థం. ఎలాగంటే, రాసం బింబ–ప్రతిబింబ న్యాయానుసారమైన దివ్య లాస్య విలాసం. ఇది అపురూపమైన స్వరూపానందమే కాని, విరూపమైన ఆభాసా (అవాస్తవిక) నందం కాదు. కామ గంధమేలేని గోపీ 'భామా కలాపం'! బింబ ప్రతిబింబాలు అభిన్నాలు. కారణం?– బింబం లేక ప్రతిబింబానికి స్వతంత్రమైన సత్త– ఉనికి లేదు. బింబానికి ప్రతిబింబం అనన్యం. కనుక, 'జీవో బ్రహ్మైవ నాపరః' (జీవుడు బ్రహ్మమే కాని అన్యుడు– ఇతరుడు కాదు). 'జీవో దేవః సనాతనః' (జీవుడూ సనాతనుడైన దేవుడే). శుకుడు– రాజా! ఇలా బాల గోపాలుడు రాసలీల చాలించి చెలువ– గోపికలతో కూడి జలక్రీడలాడటానికి తలపడ్డాడు. తరువాత నీటి నుండి వెడలవచ్చి, తనలో తాను (స్వరతిః) క్రీడించువాడైనా కరీంద్రుడు– కరేణువు– ఆడ ఏనుగులతో ఆడునట్లు, వేణు మాధవుడు పూబోణులతో క్రీడించి వారిని తృప్తి పరచాడు. ఇట్లు వెన్నుడు శరత్కాలపు వెన్నెల రాత్రులలో ఇంద్రియ– వీర్యస్థలనము లేకయే ఆ చంద్ర వదనలతో క్రీడించాడు. కావున, ఇది కామలీల కాదు. నివృత్తిపరమైన కామవిజయ లీల! తనకంటే ఇతరంగా భోగ్య (అనుభవింపదగిన) పదార్థమున్న దన్న మతి– తెలివిలోనే ఇంద్రియ స్థలనం. 'భ్రాజిష్ణుః భోజనం భోక్తా', 'అన్నమన్నాద ఏవచ'– (విష్ణు సహస్ర నామం) తినబడేది, తినేవాడూ రెండూ తానే కాన, 'దృశ్య రూపేణ చ స్వయం'– ద్రష్ట అయిన తానే దృశ్యంగా కూడా ఉన్నాడు కాన, తన్ను తానే (ఆత్మరతి) అనుభవించాడు కాని, స్వాతిరిక్త– తనకన్నా అన్యమైన పదార్థాన్ని కాదు. ఇదే ఆత్మరతి, ఆత్మక్రీడ! రాసలీలకు ఇంతకు మించి ఎంచదగిన, అపశ్రుతి లేని– నిర్దోషం నిస్సంశయమైన, నిగమనం– ఉపసంహృతి (ఉపసంహారం) ఇంచుక కూడా ఉండదేమో! (సశేషం)



మన పోతన 193 మధురిమ వ భాగం

తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

ఆ ఒక్కటీ లేకపోతే?

ఇస్లాం బోధ

ప్రముఖ ఇస్లామిక్ తత్వవేత్త అల్ ఖ్వారిజిమీ చెప్పిన సూత్రం ఏమిటంటే.. 'మీ దగ్గర నీతి, నడవడిక లుంటే 1 మార్కు. నైతికతతోపాటు అందమూ ఉంటే ఆ ఒకటికి ఒక సున్నా చేర్చండి, 10. నైతికత, అందంతోపాటు ఐశ్వర్యం కూడా ఉంటే మరో సున్నా చేర్చండి, 100. నైతికత, అందం, డబ్బుతోపాటు అమ్మానాన్న, బంధుగణమూ ఉంటే మరో సున్నా చేర్చండి, 1000. అన్నీ ఉండి కూడా మీలో నైతికత లోపిస్తే.. ముందున్న ఒకటి తొలగించండి, 000' అని మనిషి వ్యక్తిత్వాన్ని గురించి సూత్రీకరించాడు. మనిషిలో నైతికత లేకపోతే అలాంటి వ్యక్తిత్వం శూన్యమన్నారు ఖ్వారిజిమీ. ఇస్లామ్ ధర్మం నైతికతకు ఎంతో ప్రాధాన్యం ఇస్తుంది. నమాజు ఐదు పూటలు విధిగా చేయాల్సి ఉంటుంది. కానీ, నైతికత 24 గంటలూ ఆచరించాలని ఉలేమాల బోధన. నైతికత లోపించినప్పుడు ఎన్నెన్ని నమాజులు, ఉపవాసాలు, మరెన్ని దానధర్మాలు చేసినా అల్లాహ్ ఆమోదించడు. ఇరుగు పొరుగు వారిని దుర్భాషలాడుతూ... వేళకు నమాజులు చేసినా అవి అల్లాహ్ స్వీకృతి పొందవు అన్నారు ప్రవక్త. మనిషి పరిపూర్ణత్వాన్ని సాధించడానికి దారి చూపే ఆచరణే నైతికత. మనిషి నైతికతపై అతని గొప్పతనం ఆధారపడి ఉంటుంది. నైతికతను పెంచుకోవడానికి జ్ఞానార్జన అవసరం. అలాంటి జ్ఞానాన్ని ఇస్లాం బోధిస్తుంది. సత్ప్రవర్తన, పవిత్రత కలిగి, అవసరమైన వారికి చేతనైన సాయం చేయాలన్నది ఖురాన్ బోధనల సారాంశం. ఆర్థిక సంయమనం ప్రతి మనిషికి చాలా అవసరమని... ఎవరినీ అతిగా అనుమానించకూడదన్నది ప్రవక్త హితబోధ. ఇతరులపై కారణం లేకుండా నిందలు వేయకూడదు, వారి గురించి చెడుగా మాట్లాడకూడదన్నదీ ప్రవక్త ఉద్బోధ. మన కర్మలకు మనం జవాబుదారీగా ఉండాలనీ, నైతికతకు బలమైన పునాది అయిన ధైర్యాన్ని జీవితంలో ఎప్పుడూ కోల్పోకూడదనీ ఖురాన్ గుర్తుచేస్తుంటుంది.



... ముహమ్మద్ ముజాహిద్
96406 22076

మరో జన్మ

క్రీస్తు సందేశం

సాదా సీదా ప్రజలకు అర్థమయ్యే భాషలో మనిషి ప్రవర్తన గురించి క్రీస్తు అనేక సందర్భాల్లో అనేక విషయాలు బోధించాడు. మనిషి కొత్తగా పుట్టాలని ఆయన కోరుకున్నాడు. ఇది వినడానికి అసాధ్యమైన పనిగా కనిపిస్తుంది. ప్రాణాలతో ఉండగా మనిషి మళ్లీ పుట్టడం ఏంటనిపిస్తుంది. కానీ, ఒకే జన్మలో శారీరకంగా మళ్లీ జన్మించడం అసాధ్యం. కానీ, క్రీస్తు చెప్పింది.. మనిషి మారాలని. తన పాత జీవితానికి స్వస్తి పలికి, కొత్త జీవితానికి స్వాగతం పలకాలని బోధించాడు. అదే నూతన జన్మ, మళ్లీ కొత్తగా పుట్టడం. ఇది మనిషి ప్రవర్తనలోని మానసిక పరివర్తనకు సంబంధించిన మార్పు. మారు మనసు అనేది వారి జీవితానికి కొత్త ఉషస్సు. ఇదే మళ్లీ జన్మించడం! ఈ లోకంలో తప్పు చేయని మనిషి ఉండడు. ఆ తప్పును సరిదిద్దుకోవడం అవసరం అనేది క్రీస్తు సందేశం. మానసికంగా పరివర్తన చెంది, పాపభూయిష్టమైన పాత జీవితాన్ని వదిలిపెట్టి ప్రభువు చూపిన దారిలో నడిచిన ఎందరో మహనీయులయ్యారు. వారంతా నిస్సందేహంగా ప్రభువు సాన్నిధ్యాన్ని పొందుతారు.

... ప్రొ||బెర్నార్డ్ రాజు, 98667 55024